లో లెవెల్ వంతెనతో ఇబ్బందులు

వర్షం పడితే రాకపోకలు బంద్
- టేక్మాల్ మండలంలో వంతెనల దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నూతన వంతెనలు నిర్మించాలి : స్థానికులు
- పట్టించుకోని అధికారులు



ఎలకుర్తి దారిలోని కోరంపల్లి శివారులో వంతెనపై పారుతున్న వర్షపు నీరు(ఫైల్)

టేక్మాల్(మెదక్): లో లెవెల్ వంతెనలతో వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే వరదలతో వంతెనలు మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రాణ సంకటంగా మారుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా జోగిపేట నుంచి మండలంలోని ధనురా మీదుగా మండల కేంద్రమైన టేక్మాల్‌కు రావాలంటే గుండు వాగు వంతెనలో లెవెల్‌గా ఉంది. జోగిపేట నుంచి ధనురా, కోరంపల్లి మీదుగా ఏడుపాయలకు, ఎలకుర్తి, అచ్చన్నపల్లి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద వంతెన లోతట్టుగా మారడంతో పాటు ధ్వంసమై అధ్వాన్నంగా మారింది. కుసంగి నుంచి మల్కాపూర్‌కు, టేక్మాల్ నుంచి అచ్చన్నపల్లికి, ఎల్లుపేట నుంచి నార్సింగ్‌కు వెళ్లే వంతెన పూర్తిగా నేలకు సమాంతరంగా మారింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వట్టిపల్లి, టేక్మాల్ మండలాల్లోని చెరువులు, కుంటలు నిండుకొని అలుగులు పారడంతో లోలెవల్ బ్రిడ్జిల పైనుంచి గుండు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధిక వర్షంతో మూడు నాలుగురోజులపాటు రోడ్లను మూసివేస్తారు. దీంతో అవతలి గ్రామాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. కిలోమీటర్లు పెరగడంతో పాటు సమయం అధికమవుతుందని వాహనదారులు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో నానా అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఉన్న బ్రిడ్జిలు సైతం లోతట్టుగా మారడంతో పాటు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వరద నీటికి గతంలో బైక్, పశువులు కొట్టుకుపోయాయి. ఆటో బ్రిడ్జిపైకి వచ్చి వరద ప్రవాహానికి ఎటు పోకపోవడంతో ఇతరుల సహాయంతో బయటకు తీశారు. గతేడాది నల్లకుంట తండాకు చెందిన విట్టల్ నాయక్ రోడ్డు దాటుతుండగా వరద ఉధృతికి గుండు వాగులో పడి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకుని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రెస్క్యూ చేసి అతన్ని కాపాడారు. లో లెవెల్ వంతెనలతో పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రస్తుత ఎండాకాలంలో నూతన వంతెనలు నిర్మించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



టేక్మాల్ గుండువాగు లోలెవెల్ వంతెనపై పారుతున్న నీటిలో మధ్యలో చిక్కుకున్న ఆటో(ఫైల్)

మట్టి రోడ్డు తొలగింపుపై ఆందోళన

పనులను అడ్డుకొని రైతుల నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డును తొలగించడంపై రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలో పొలాలకు వెళ్లేందుకు 20 ఏళ్ల క్రితం పనికి ఆహార పథకంలో మట్టి రోడ్డును వేశారు. ఈ రోడ్డు పట్టా భూమిలోకి వచ్చిందని సదరు పట్టాదారుడు హిటాచీతో రోడ్డును తొలగించడంతో రైతులు అడ్డుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు పాపయ్యచారి, చంద్రయ్య, భిక్షపతి, లింగం, యాదయ్య, అక్బర్, రాములు, శంకరయ్య మాట్లాడుతూ.... అక్రమ పట్టాలు సృష్టించి రోడ్డును తొలగిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కమలాద్రి ఘటనా స్థలానికి చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నక్షబాటను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అనంతరం గ్రామ పరిధిలో కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



తొలగించిన రోడ్డు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌరి పిలుపునిచ్చారు. ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై పనిభారాన్ని మోపుతుందన్నారు. స మ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

రైతులు అవగాహనతో పంటలు వేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు పరిస్థితులను బట్టి పంటలు వేయాలని, రసాయనాలు అవసరం మేరకే వాడాలని వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని జీడిపల్లి, మనోహరాబాద్ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్గానిక్ పంటలపై, రసాయన మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్రవంతి, ఏఈఓలు నరేందర్‌గౌడ్, సచిన్, పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మంచి నడవడిక నేర్పించండి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు మంచి నడవడిక నేర్పించాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ప్రభుత్వం మినీఅంగన్‌వాడీ టీచర్లను ప్రధాన అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ వేతనాన్ని రూ.7,800 నుంచి రూ.13,650లకు పెంచిన నేపథ్యంలో శుక్రవారం ఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డితోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సంజీవరెడ్డి మాట్లాడుతూ...పిల్లల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త విద్యాసంవత్సరం నుంచి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహించనున్నందున టీచర్లు పిల్లలపై ప్రత్యేక దృష్టిపెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని జూకల్ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను సంజీవరెడ్డి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తిచేసి మిగిలిన శానిటరీ, విద్యుత్ వైరింగ్, తాగునీటి వసతి పనులను పూర్తిచేయాలని గుత్తేదార్లను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారంశంకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వెల్దుర్తి(తూప్రాన్) : మండలంలోని బండపోసాన్‌పల్లి 5వ వార్డులో ఏర్పడిన మంచినీటి ఎద్దడిని పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి గౌరి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో అటెండర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో వేసవి కాలం ఆరంభం నుంచి మంచినీటి సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యకాస మండల కార్యదర్శి సరేందర్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి బాలకృష్ణ, కుమార్ ఉన్నారు.

చెక్కు అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన శివ్వోల్ల రామకృష్ణ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.21 వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శుక్రవారం లబ్ధిదారుడికి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కు అందజేసిన వారిలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనర్సింహులు, భరత్, బాలాజీ, చిన్న కృష్ణాగౌడ్, బాలకృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న హరిప్రసాద్

చేగుంట(తూప్రాన్): జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన బాలసాయి హరిప్రసాద్ నియమితులయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు విఠల్, ప్రచార కమిటీ చైర్మన్ రమేశ్ నియామక పత్రం అందించినట్లు ఆయన తెలిపారు. వినియోగదారులకు, వస్తు సేవలకు సంబంధించిన హక్కుల కమిషన్ తరపున వారధిగా పనిచేస్తానని పేర్కొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్ గ్రామంలో రేషన్ దుకాణంను తహసీల్దార్ మన్నన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి సన్న బియ్యం నాణ్యత గురించి ఆరా తీశారు. సమయానుకూలంగా రేషన్ బియ్యం అందించాలని, రేషన్ డీలర్‌కు పలు సూచనలు చేశారు. అంతకు ముందు జంగరాయిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

అమర జవాన్‌కు ఘన నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళి నాయక్‌కు ఘన నివాళులర్పించారు. మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో శుక్రవారం రాత్రి గిరిజన సంఘాలు, పలు పార్టీల నాయకులు సంతాపం తెలుపుతూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇక్కట్లు

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొంతన్‌పల్లి గ్రామంలో కేంద్రానికి వచ్చిన ధాన్యం సకాలంలో తరలించడం లేదని, తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆరోపించారు. ఎదుల్లాపూర్ కొనుగోలు కేంద్రంలో మ్యాచర్ మిషిన్ లేకపోవడంతో ధాన్యం తూకానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోయారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు పేర్కొన్నారు.

రమణీయం.. రంగనాయక స్వామి కల్యాణం

కొల్చారం (నర్సాపూర్): కొల్చారం మండలం రంగంపేటలోని శ్రీ రంగనాయక స్వామి పంచాహ్నిక కల్యాణోత్సవాన్ని శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. దేవాలయ ఆవరణలో పచ్చని తోరణాలతో పెళ్లి పందిరి వేశారు. స్వామివారి అమ్మవార్ల కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్థానిక హనుమాన్ మందిరం నుంచి ఉత్సవ విగ్రహాలకు పలకీలో ఉంచి ఎదుర్కోళ్లు నిర్వహించారు. కల్యాణ వేడుకలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైష్ణవ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ,అమ్మవార్లకు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ధాన్యం తూకంలో అవకతవకలపై విచారణ

చేగుంట(తూప్రాన్): ధాన్యం తూకంలో అవకతవకలు జరిగాయనే విషయంలో రైతుల ఫిర్యాదుతో మక్కరాజీపేటలో తహసీల్దార్ శుక్రవారం విచారణ జరిపారు. ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఎక్కువగా తూకం వేసారని కేంద్రం నిర్వాహకురాలు అనితపై రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ తూకం యంత్రాన్ని పరిశీలించగా క్వింటాలుకు దాదాపు మూడు కేజీల ధాన్యం ఎక్కువగా తూకం వేస్తున్నారని గుర్తించారు. వెంటనే తూకం యంత్రాన్ని మార్చడంతో పాటు ఇప్పటి వరకు తూకం వేసిన రైతులు నష్టపోయిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు ఇప్పిస్తానన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులకు ఇబ్బంది కల్గించే విధంగా వ్యవహరిస్తే కఠినచర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు. ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద విచారణ చేస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

నేటి నుంచి నరసింహస్వామి ఉత్సవాలు

ముస్తాబైన దేవాలయం

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని రామాలయం సమీపంలో కిష్టాపూర్ రోడ్‌లో స్వయంభుగా వెలసిన కూర్మ నరసింహస్వామి జయంతి వేడుకలు నేటి నుంచి 11వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ చైర్మన్ జ్యోతి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం ఉదయం ధ్వజారోహణం, అభిషేకం, లక్ష పుష్పార్చన, విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామికి చందన విలేపం, ఆకు పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కూర్మ నరసింహ స్వామి జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ, లక్ష పుష్పార్చన, సుదర్శన హోమం, అనంతరం అన్నదాన ప్రసాదం వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



ఆలయంలో కొలువుదీరిన స్వామివారు



ముస్తాబైన నరసింహ స్వామి ఆలయం

నేడు విద్యుత్ సరాఫరాకు అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ దినకర్, ఏడీఈ మోహన్‌బాబు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

కాళ్లకల్ సబ్ స్టేషన్ పరిధిలో..

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ మరమ్మతులలో భాగంగా కాళ్లకల్ సబ్ స్టేషన్ పరిధిలో సరఫరాకు ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

జిల్లాలోని పలు మండలాల్లో..

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని మెదక్ పట్టణంతోపాటు పలు మండలాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మెదక్ టౌన్, మెదక్, చిన్న శంకరంపేట్, హవేలీ ఘనపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో అవసరమైన విద్యుత్ తీగల మరమ్మతులు, ట్రీ కట్టింగ్, స్తంభాల మార్పులు వంటి పనులు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల ఉదయం 8 గంటల నుంచి 11 వరకు ఆయా విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, తండాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీమాధవానంద సరస్వతి, ఎమ్మెల్యే సునీతారెడ్డి, భక్తులు

నర్సాపూర్: నాల్గు రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతూ శుక్రవారం శ్రీకన్యకాపరమేశ్వరి మాత విగ్రహ ప్రతిష్ఠ చేశారు. నర్సాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. కాగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆమెను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీమాధవానంద సరస్వతి, ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్‌లతో పాటు పలువురు నాయకులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీకన్యకాపరమేశ్వరి మాత

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ఆలయ పూజారి గోపాలకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా వామన అవతారంలో పల్లకిసేవ ఊరేగింపు చేపట్టారు. భక్తులు హారతులిచ్చి పూజలు చేశారు.



గ్రామ వీధుల్లో పల్లకీ సేవ

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ఆధారంగా చెల్లిస్తాం

నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్

నర్సాపూర్ రూరల్: మార్కెట్ విలువలు పరిశీలించి భూముల ధరలు నిర్ణయించి సంగారెడ్డి రీచ్ 2 కెనాల్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తామని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ రైతు వేదికలో శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ భూ నిర్వాసితులతో అవార్డు ఎంక్వయిరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నుంచి 2024 వరకు భూములు కోల్పోతున్న గ్రామాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ఆధారంగా ఎక్కువ మార్కెట్ ధర ఉన్న దాని ఆధారంగా మూడోవంతు ధరలు నిర్వహించి నిర్వాసితులకు డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. అనంతరం రైతులు ఓపెన్ మార్కెట్ ఆధారంగా భూములకు ధరలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సికింద్లాపూర్ భూ నిర్వాసితులు, తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ కిషన్ పాల్గొన్నారు.



ఓపెన్ మార్కెట్ ఆధారంగా భూములకు ధరలు చెల్లించాలని కోరుతున్న నిర్వాసితులు

క్లుప్తంగా

బస్సు సర్వీసు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

రేగోడ్(మెదక్): బస్సులు రాక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం 'సాక్షి'లో బస్సు మళ్లీ తుస్సు. అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి నారాయణఖేడ్ ఆర్టీసీ బస్సు డిపో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. రేగోడ్‌కు ఉదయం 8:30 నిమిషాలకు రావాల్సిన నారాయణఖేడ్-పటాన్‌చెరు బస్సు సర్వీసు 8:50 నిమిషాలకు రేగోడ్ మీదుగా పటాన్‌చెరుకు అధికారులు మళ్లీ పునరుద్ధరించారు. బస్సు సర్వీసు ప్రారంభించినా సమయ పాలన పాటించలేదు. కాగా ప్రయాణికులు ఆనందంగా బస్సెక్కి ప్రయాణించారు. సమస్యను పరిష్కరించేలా కథనం ప్రచురించిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే రోహిత్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ గ్రామ పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం కొనసాగుతుంది. 15 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఉత్స వాల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

హత్నూర బీజేపీ అధ్యక్షుడిగా నాగప్రభుగౌడ్



నాగప్రభుగౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్

నర్సాపూర్ : పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం హత్నూర మండల శాఖ పార్టీ అధ్యక్షుడిగా నాగప్రభుగౌడ్‌కు నియామకపత్రం అందచేసి మాట్లాడారు. జిల్లాలోని ఆయా మండల శాఖలకు అధ్యక్షులను ఇతర కమిటీ ప్రతినిధులను నియమించే కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు మహేశ్, చంద్రంగౌడ్, రాజేశ్, కుమార్, రాంరెడ్డి, నగేశ్, నారాయణరెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఉపాధి హామీ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. జూకల్, కొత్తపేట, వీరోజీపల్లి, పెద్దశంకరంపేట తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఈజీఎస్ ఏపీఓ సంతోష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. కూలీల హాజరుశాతం, మస్టర్ల నిర్వహణ, పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులున్నారు.

కార్యాలయ తలుపు ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన గది తలుపు

శివ్వంపేట(నర్సాపూర్): పాఠశాల కార్యాలయ తలుపులను ధ్వంసం చేసిన ఘటన మండల పరిధిలోని గుండ్లపల్లి యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల హెచ్‌ఎం గది తలుపు ధ్వంసం చేశారు. తలుపు ధ్వంసమైన విషయాన్ని గ్రామస్తులు సంబంధిత హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264